క్లుప్తంగా

ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు

పెండ్లిమర్రి : గ్రామాల్లో చిన్న చిన్న సమస్యలకు ఘర్షణలకు పాల్పడితే అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవని సీఐ చల్లని దొర తెలిపారు. పెండ్లిమర్రి సీఐ కార్యాలయంలో శనివారం రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎమైనా సమస్యలు ఉంటే పోలీసుల దృష్టికి తీసుకవచ్చి పరిష్కరించుకోవాలన్నారు. అల్లర్లకు పాల్పడిన, గొడవలు సృష్టించిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఒక్కరు గొడవలకు పాల్పడకుండా ప్రశాంత జీవితాన్ని గడపాలని సూచించారు.

ముగిసిన భాగవత పఠనం


భాగవత పఠనం నిర్వహిస్తున్న భాగవత పండితులు

వేంపల్లె : మండలంలోని తాటిమాకులపల్లెలో ఉన్న శ్రీయోగానంద గురువిరెడ్డి ఆశ్రమంలో పులివెందుల భాగవత భక్త సమాజం ఆధ్వర్యంలో దాత రామలింగారెడ్డి చేయూతతో 14 రోజులపాటు నిర్వహించిన భాగవత పఠనం శనివారంతో ముగిసింది. ముగింపు సందర్భంగా మంత్రపుష్పం పఠనంతో సంపూర్ణ బమ్మెర పోతన భాగవతం పరిపూర్తి చేసిన పండితులను కడపకు చెందిన వడ్డెమాని రామలింగారెడ్డి ఘనంగా సన్మానించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14 రోజులపాటు బమ్మెర పోతన భాగవత పఠనం చేయడంవల్ల మంచి సత్ప్రవర్తన కలుగుతుందన్నారు. అలాగే మహిళా భాగవతలకు చీరలతో సత్కారం చేశారు. ఈ భాగవతా పఠనంలో దాదాపు 500 మంది భక్తులు పాల్గొన్నారు. అనంతరం అన్న ప్రసాదాన్ని అందించారు.

కొప్పల ప్రభాకర్‌రెడ్డికి గౌరవ డాక్టరేట్ ప్రదానం


ప్రభాకర్‌రెడ్డికి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేస్తున్న యూనివర్శిటీ అధికారులు

పులివెందుల టౌన్ : గనుల రంగ నిపుణుడు, ఎస్‌యూఎంఎస్ గ్రూప్ అధినేత కొప్పల ప్రభాకర్‌రెడ్డికి శనివారం గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లెకు చెందిన కె.నారాయణరెడ్డి, రామలక్ష్మమ్మల కుమారుడు కొప్పల ప్రభాకర్‌రెడ్డి. ఈయన ప్రతిభను గుర్తించి తమిళనాడుకు చెందిన ఏసియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ 'బిజినెస్ డెవలప్మెంట్ మరియు సోసియల్ సర్వీస్'లో ఆ కళాశాల కల్చరల్ అడ్వయిజర్ వి.బాబు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. పలువురు నిర్మాణ రంగ నిపుణులు, ఇంజనీర్లు, స్నేహితులు, సోదరులు, గ్రామస్తులు ఆయనకు అభినందనలు తెలిపారు.

మహిళలకు చట్టాలపై అవగాహన ఉండాలి


మాట్లాడుతున్న కమలాపురం కోర్టు మెజిస్ట్రేట్ లావణ్య

ఎర్రగుంట్ల : మహిళలందరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని కమలాపురం కోర్టు మెజిస్ట్రేట్ లావణ్య తెలిపారు. శనివారం ఎంపీడీఓ సభాభవనంలో న్యాయ మహిళా విజ్ఞాన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. మహిళలు సివిల్, క్రిమినల్ కేసులపై అవగాహన ఉండాలన్నారు. మహిళ రక్షణ కోసం ప్రభుత్వం అనేక చట్టాలను అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో లాయర్లు, మహిళలు పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల తనిఖీ

పులివెందుల రూరల్ : పట్టణంలోని ఇస్లాంపురంలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ను శనివారం ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం భోజనంలో నాణ్యతలో ఎటువంటి రాజీ పడొద్దని ఉపాధ్యాయులను హెచ్చరించారు.

ఖైదీలు న్యాయ సహాయాన్ని పొందవచ్చు


సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి ఫక్రుద్దీన్

జమ్మలమడుగు : జైలు శిక్ష అనుభవిస్తున్న ఖైదీలు న్యాయ సహాయాన్ని పొందవచ్చు అని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్ తెలిపారు. శనివారం జిల్లా జడ్జి పట్టణంలోని సబ్ జైలును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఖైదీలకు లీగల్ ఎయిడ్ క్లీనిక్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఖైదీ క్షణికావేశంలో చేసిన తప్పులకు జైలు శిక్షలు అనుభవిస్తున్నారు. న్యాయ సహాయం కావలసిన వారు లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ 15100కు ఫోన్ చేసి న్యాయం పొందవచ్చు అని సూచించారు.

రబీ పంటలపై తెగుళ్లు, కరువు దెబ్బ

- ఎండుతున్న పప్పు శనగ, తెగుళ్లతో మినుము పంట
- వర్షాభావంతో నష్టాల్లో అన్నదాత
- ఆందోళనలో రైతన్నలు


ఎండు దశకు చేరుకుంటున్న మినుము పంట

వేంపల్లె : ఈ ఏడాది ఖరీఫ్‌లో వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలను సాగు చేయలేకపోయిన రైతులు రబీపై ఆశలు పెట్టుకున్నారు. మండలంలో ఆయా గ్రామాల్లో సాగుచేసిన రబీ పంటలపై ఒకవైపు తెగుళ్లు, మరోవైపు వరుణుడు దయ చూపకపోవడంతో ఎండు దశకు చేరుకుంటున్నాయి. దీంతో రైతులు నీటితడులు ఇవ్వడానికి పడరాని పాట్లు పడుతున్నారు. నీరు అందుబాటులో లేని పంటలు (వర్షాధారం) తెగుళ్ల, వాడు దశకు చేరుకుని పండుటాకులు పడుతున్నాయి. మండలంలోని ముత్తుకూరు, రామిరెడ్డిపల్లె, పాములూరు, అమ్మగారిపల్లె, నాగూరు, అయ్యవారిపల్లె, అలవలపాడు, కత్తులూరు, నందిపల్లె తదితర గ్రామాల్లో దాదాపు 800 హెక్టార్లలో మినుము, 600 హెక్టార్లలో పప్పు శనగ, 500 ఎకరాలలో నువ్వు పంటలను సాగు చేశారు. ఒక్కో రైతు ఎకరాకు దాదాపు రూ.25 వేల వరకు పెట్టుబడులు పెట్టారు. అయితే పంటలు సాగు చేసినప్పటి నుంచి దాదాపు నెల రోజులుగా వర్షం జాడ లేకపోవడంతో మొలకెత్తిన పంటలు ఎండు దశకు చేరుకుంటున్నాయి. దీంతో చేసేదేమీ లేక కొంతమంది రైతులు నీటి వసతి ఉన్న తోటల యజమానులను బతిమలాడి నీటి తడులు అందిస్తుండగా, నీటి సదుపాయంలేని రైతుల పొలాలు నిలువునా ఎండిపోతున్నాయి. ఈ ఏడాది సెప్టెంబర్ 15 నుంచి మినుము పంట వేసి రెండు నెలలు దాటడంతో ఉన్నట్టుండి వైరస్ సోకి పండుటాకులు పడుతున్నాయి. ఇంకో రెండు రోజుల్లోపు వర్షం పడకపోతే దిగుబడి తగ్గడమే కాక పూర్తిగా పంట ఎండిపోయే ప్రమాదం ఉందని రైతులు చెబుతున్నారు. గత ఐదేళ్లుగా వేరుశనగ పంట సాగు చేసి నష్టాలు పాలైన రైతన్నలు మినుము, పప్పు శనగ, నువ్వులు తదితర పంటలు సాగు చేసి నష్టాలు పూడ్చుకుందామనుకుంటే పంట మొలక దశలోనే ఎండుతుండటంతో రైతన్నలు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. వర్షం కోసం రైతులు ఆకాశం వైపు దీనంగా చూస్తున్నారు. వారం రోజుల్లో వర్షం జాడ లేకపోతే సాగుచేసిన రబీ పంటలు చేలల్లోనే ఎండుతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

10 ఎకరాల్లో సాగు చేశా



ఈ ఏడాది పది ఎకరాల్లో మినుము పంట సాగు చేశాను. మినుము పంట సాగుకు ఎకరాకు రూ.25 వేలు ఖర్చు వచ్చింది. పైరు చక్కగా మొలక వచ్చినప్పటికీ ఒక వైపు తెగుళ్లు, మరోవైపు వర్షం రాకపోవడంతో ఎండిపోతోంది. గత రెండేళ్లుగా రైతులకు తీవ్రంగా నష్టం వాటిల్లగా.. ఈ ఏడాది కూడా పంట చేతికి అందే పరిస్థితి కనిపించడం లేదు. వ్యవసాయ అధికారులు స్పందించి నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలి.

– ఎద్దుల రామాంజనేయరెడ్డి, మినుము రైతు, అయ్యవారిపల్లె

మినుము పంట ఎండుతోంది



నేను 8 ఎకరాల్లో మినుము పంట సాగు చేశాను. పంట సాగు చేసినప్పటి నుంచి పెద్దగా వర్షం జాడ కనిపించలేదు. దీంతో పంట పూర్తిగా ఎండు ముఖం పట్టడమే కాక మరోవైపు వైరస్ సోకి పండుటాకులు పడుతున్నాయి. దీంతో ఏమి చేయాలో దిక్కు తోచడం లేదు. ఇప్పటికే దాదాపు ఎకరాకు రూ.25వేలపైనే పెట్టుబడులు పెట్టాను. ప్రభుత్వమే నష్టపరిహారం అందించి ఆదుకోవాలి.

– తుపాకుల గంగిరెడ్డి, మినుము రైతు, ముతుకూరు

ప్రభుత్వానికి నివేదికలు పంపాం



వర్షాభావ పరిస్థితులవల్ల మినుము, పప్పుశనగ, నువ్వులు తదితర పంటలు దెబ్బతింటున్న విషయం వాస్తవమే. ప్రకృతిలో మార్పు రావడంవల్ల మినుము పంటలకు తెగుళ్లు సోకాయి. మినుము పంట సాగుచేసిన ప్రతి రైతు వివరాలను ఈ-క్రాప్ బుకింగ్ ద్వారా నమోదు చేస్తాం. ప్రభుత్వం నష్టపరిహారం ప్రకటిస్తే ఆ మేరకు అందరికీ అందించడం జరుగుతుంది.

– రాజేంద్రప్రసాద్, మండల వ్యవసాయ అధికారి, వేంపల్లె

నేటి నుంచి ఉరుసు వేడుకలు

వేంపల్లె : వేంపల్లెలోని పాపాఘ్ని నది ఒడ్డున వెలసిన శ్రీ హజరత్ సయ్యద్ ఖ్వాజాదర్‌బార్ జిందేషా మదార్షా వలి ఉరుసు ఆదివారం నుండి ప్రారంభమవుతుందని దర్గా కమిటీ సభ్యుడు చాన్‌బాష తెలిపారు. అరబ్ దేశం నుండి బయలుదేరి భారతదేశంలోకి ప్రవేశించి వేంపల్లెలోని కాలేజీ రోడ్డులో పాపాఘ్ని నది ఒడ్డున బిడ్డాలమిట్టలో నివాసం ఏర్పాటు చేసుకుని భక్తులకు దైవ సందేశాన్ని వినిపిస్తూ అదే ప్రాంతంలో సజీవ సమాధులైనట్లు పూర్వీకులు తెలిపారు. అనాటి నుండి ఉరుసు వేడుకలను నిర్వస్తున్నట్లు తెలిపారు. 1వ ఆదివారం గంధం, 2వ తేదీన ఉరుసు నిర్వహిస్తున్నట్లు సభ్యులు తెలిపారు. ఉరుసు రోజు రాత్రి 10 గంటలకు ప్రత్యేక ఖవ్వాళి పాట కచేరి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న హిందు, ముస్లింలు ఉరుసు వేడుకలకు హజరు కావాలని కోరారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు సర్వం సిద్ధం

సింహాద్రిపురం : ఈనెల 8వ తేదీన జరిగే సాగునీటి సంఘాలకు సర్వం సిద్ధం చేశామని తహసీల్దార్ నాగేశ్వరరావు తెలిపారు. శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నీటి సంఘానికి పోటీ చేసే అభ్యర్థి నీటి పన్ను తప్పనిసరిగా చెల్లించి ఉండాలని, లేకపోతే వారి అప్లికేషన్ తిరస్కరించడం జరుగుతుందన్నారు. మండల వ్యాప్తంగా 5 సాగునీటి సంఘాలు ఉన్నాయన్నారు. పోలింగ్ కేంద్రాలలో ఇద్దరు వ్యక్తులు ఓట్లు వేయడానికి వస్తే చేతులు ఎత్తాల్సి ఉంటుందని, ఎక్కువ మంది వస్తే ఓట్లు వేయాల్సి ఉంటుందని ఆయన తెలిపారు.

ఎలాంటి ఇబ్బందులు పెట్టలేదు


ట్రిపుల్ ఐటీ డైరెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న ట్రిపుల్ ఐటీ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది

వేంపల్లె : ట్రిపుల్ ఐటీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులను అధికారులు ఎలాంటి ఇబ్బందులు పెట్టలేదని వారు తెలిపారు. శనివారం ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ క్యాంపస్‌లో వారు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్‌కు కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు ట్రిపుల్ ఐటీలో ఔట్ సోర్సింగ్ పద్ధతిన ఎలక్ట్రిషన్‌గా పని చేస్తున్న ఒక ఉద్యోగి తమ నాయకుడుగా చెప్పుకుంటూ చలామణి అవుతున్న వ్యక్తి మా నాయకుడు కాదని వినతిపత్రంలో వివరించారు. ఒక యూట్యూబ్ ఛానల్‌లో తమ నాయకుడు అని చెప్పుకుంటూ ట్రిపుల్ ఐటీ అధికారులపై అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో పరిపాలన అధికారి రవికుమార్, మెయింటెనెన్స్ అధికారిగా పనిచేస్తున్న అనిల్‌కుమార్‌రెడ్డిపై వస్తున్న ఆరోపణలు అవాస్తవమన్నారు. ప్రతి నెలా తమకు సక్రమంగా జీతాలు కూడా వస్తున్నట్లు చెప్పారు. అధికారులు కూడా తమ సమస్యను గుర్తించి వెంటనే చర్యలు తీసుకుంటున్నారని, ట్రిపుల్ ఐటీ డైరెక్టర్, ఎఓ, మెయింటెనెన్స్ అధికారితో మాకు ఎలాంటి సమస్యలు లేవని చెప్పారు. ట్రిపుల్ ఐటీ అధికారులు ఉద్యోగులకు సహకరిస్తున్నారని, జీతాలకు సంబంధించి క్యాంపస్ మెయింటెనెన్స్ అధికారికి ఎలాంటి సంబంధం లేదన్నారు. ప్రస్తుతం ఉన్న అధికారులు హౌస్ కీపింగ్ ఉద్యోగులకు ఐడెంటి కార్డులు కూడా ఇచ్చినట్లు తెలిపారు. ఎన్ని రోజులు డ్యూటి చేస్తే అన్ని రోజులు కూడా సక్రమంగా జీతాలు వస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ ఉద్యోగులు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో ఉక్కు పరిశ్రమ నిర్మించాలని నిరసన


ఉక్కు పరిశ్రమ నిర్మించాలని నిరసన వ్యక్తం చేస్తున్న పీఆర్ఎస్ నాయకులు

కమలాపురం : జిల్లాలో ఉక్కు పరిశ్రమ నిర్మించి నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రగతిశీల రెవల్యూషనరీ విద్యార్థి యువజన సంఘం (పీఆర్ఎస్ వైఎఫ్) జిల్లా కన్వీనర్ ఓరుగంటి నాగేంద్రబాబు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వద్ద విద్యార్థులతో కలసి ఉక్కు పరిశ్రమ నిర్మించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. రాయలసీమ కరువు, వలసలు, రైతుల ఆత్మహత్యలకు నిలయమని, ఇలాంటి రాయలసీమ ప్రాంతంలో ఉక్కు పరిశ్రమను స్థాపించి సమస్యలన్నింటిని పరిష్కరించాలన్నారు. జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీలు, విద్యార్థి, యువజన, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జాయింట్ యాక్షన్‌గా పలు రకాల ఆందోళనలు, రిలే నిరాహార దీక్షలు, ఆమరణ నిరాహార దీక్షలు చేశామన్నారు. ఈ దీక్షల్లో ప్రస్తుతం అధికారంలో ఉన్న టీడీపీ నాయకులు కూడా ఉన్నారని, ప్రస్తుతం కూటమీ ప్రభుత్వం అధికారంలో ఉన్నందున కూటమి నాయకులు ముందుకు వచ్చి ఉక్కు పరిశ్రమ నెలకొల్పేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో దశలవారీ ఉద్యమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో పీఆర్ఎస్ వైఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

పొదుపు అలవాటు చేసుకోవాలి


కమలాపురం జడ్పీ గర్ల్స్ హైస్కూల్ విద్యార్థులకు జీరో అకౌంట్ ఓపెన్ చేయిస్తున్న వీర నారాయణ

కమలాపురం : ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే పొదుపు పాటించడం అలవాటు చేసుకోవాలని ఏకలవ్య ఫౌండేషన్ విద్యా వాహిని కోఆర్డినేటర్ వీరనారాయణ తెలిపారు. శనివారం స్థానిక జడ్పీ బాయ్స్, గర్ల్స్ హైస్కూల్ విద్యార్థులకు ఏపీజీబీ క్రాస్ రోడ్డు శాఖ సహకారంతో జీరో అకౌంట్ ఖాతాలు తెరిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు బ్యాంక్ అకౌంట్ లావాదేవీలు నిర్వహించడం, బ్యాంకులపై అవగాహన పెంపొందించడం ఏకలవ్య ఫౌండేషన్ ముఖ్య ఉద్దేశం అన్నారు. అందులో భాగంగానే గత పది రోజులుగా మండలంలోని అన్ని జడ్పీ హైస్కూల్స్‌కు చెందిన విద్యార్థులకు ఏపీజీబీ ద్వారా జీరో అకౌంట్లు చేయిస్తున్నామన్నారు. ప్రతి విద్యార్థి పొదుపు పాటించడం అలవాటు చేసుకోవాలన్నారు. డబ్బులు ఊరికే రావని, ఉన్న డబ్బులను పొదుపు చేసుకుంటే ఏవైన సమస్యలు వచ్చినపుడు వాటిని వినియోగించుకోవచ్చని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులకు జీరో అకౌంట్లు తెరిచిన ఏపీజీబీ బీఎం చైతన్య, సిబ్బంది వెంకట రమణ, శ్వేతలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

ఘనంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం


అయ్యప్ప స్వామి గ్రామోత్సవం

చెన్నూరు(వల్లూరు) : మండల పరిధిలోని ఉప్పరపల్లెలో శనివారం రాత్రి అయ్యప్పస్వామి గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి అభిషేకాలను నిర్వహించారు. అనంతరం పడిపూజ కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించి లక్షార్చన చేశారు. మధ్యాహ్నం అన్న సంతర్పణ జరిగింది. రాత్రి స్వామి వారి గ్రామోత్సవం వెంట సాగిన వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి. కొట్టాయం హరిరామ బృందంచే కేరళ వాయిద్యాలు, కాంతార కార్యక్రమం, చెక్క భజన, కోలాట ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వివిధ వేషధారణలతో కళాకారులు చేసిన విన్యాసాలు, ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుండి అయ్యప్ప స్వామి భక్తులు హాజరయ్యారు.

మల్లేశ్వరస్వామిని దర్శించుకున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి


పొలతలలో మల్లేశ్వరస్వామి దర్శించుకున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి

పెండ్లిమర్రి : జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీదేవి కుటుంబ సమేతంగా శనివారం సాయంత్రం పొలతల శైవక్షేత్రంలోని శ్రీమల్లేశ్వరస్వామి, పార్వతిదేవి అమ్మవారిని దర్శించుకున్నారు. ముందుగా ఆలయ ఈఓ కృష్ణానాయక్ జిల్లా ప్రధాన న్యాయమూర్తిని ఆలయ మర్యాదాలతో ఆహ్వానించారు. అనంతరం మల్లేశ్వరస్వామి, పార్వతిదేవి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈఓ, వేద పండితులు వారికి శాలువాతో సత్కరించారు.

2 నుంచి జూనియర్ స్థాయి కబడ్డీ పోటీలు

వీరపునాయునిపల్లె : పాయసంపల్లెలోని కందుల మంగమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నుంచి జూనియర్ విభాగం కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు పాఠశాల పీడీ వెంకటసుబ్బన్న, ప్రధానోపాధ్యాయుడు మురలీకృష్ణ తెలిపారు. ఈ పోటీల్లో కడప, అన్నమయ్య జిల్లాకు చెందిన 14 సంవత్సాలలోపు విద్యార్థులు పాల్గొంటారన్నారు.

నేడు ధ్యాన ఆత్మజ్ఞాన శిక్షణ శిబిరం

పులివెందుల టౌన్ : పట్టణంలోని శ్రీనివాస థియేటర్ వద్దగల గీతా మందిరంలో ప్రపంచ పిరమిడ్ స్పిరుచువల్ సొసైటీ వ్యవస్థాపకులు డాక్టర్ బ్రహ్మర్షి పితామహ సుభాష్ పత్రీజీ ఆధ్వర్యంలో బ్రహ్మశ్రీ కంచి రఘురాం సహకారంతో ప్రముఖ ధ్యానశిక్షకులు లలితకుమారి వారి ఉపన్యాస మరియు ధ్యాన శిక్షణపై ఉచిత వర్క్ షాప్ ఏర్పాటు చేశామని పులివెందుల పిరమిడ్ స్పిరుచువల్ సొసైటీ నిర్వాహకులు రమేష్‌రెడ్డి తెలిపారు. ఈ వర్క్‌షాపునకు పులివెందుల నియోజకవర్గంలోని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఉచిత ధ్యాన శిక్షణ కార్యక్రమానికి తప్పక హాజరు కావాలని, శిక్షణకు హాజరైనవారందరికీ మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆసక్తిగలవారు ఆదివారం ఉదయం 9 గంటలకు గీతామందిరం చేరుకోవాలని, మరిన్ని వివరాలకు 9441636570 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

గురజాడ నవయుగ వైతాళికుడు

వేంపల్లె : గురజాడ అప్పారావు నవయుగ వైతాళికుడని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్రమణ్యం, కాంగ్రెస్ మండల కన్వీనర్ రామకృష్ణలు తెలిపారు. శనివారం గురజాడ 109వ వర్ధంతిని వేంపల్లెలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశమంటే మట్టి కాదోయ్ దేశమంటే మనుషులోయ్ అన్న దేశభక్తి సందేశాన్ని అందించిన నిజమైన దేశభక్తుడు గురజాడ అన్నారు. స్త్రీ జనోద్ధరణ, సంఘ సంస్కరణ, భాషోద్యమం ఈ మూడింటిని గురజాడ నడిపించాడని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ఏర్పాటుకు ఆర్థిక సాయం

పులివెందుల టౌన్ : పట్టణంలో రెడ్డి కమ్యూనిటీ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో త్వరలో ఏర్పాటు చేసే ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహ ఏర్పాటుకు అన్నారెడ్డి భూపాల్‌రెడ్డి తనవంతు ఆర్థిక సహాయాన్ని అందించినట్లు రెడ్డి కమ్యూనిటీ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి తెలిపారు. శనివారం అన్నారెడ్డి భూపాల్‌రెడ్డికి ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జ్ఞాపికను ఆయన అందజేశారు. పులివెందులలో ఉయ్యాలవాడ విగ్రహానికి ఆర్థిక సహాయాన్ని అందించేందుకు రెడ్డి కమ్యూనిటీ దాతలు ముందుకు రావాలని కోరారు. ఇంతవరకు పులివెందులలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహంలేదని ప్రస్తుతం ఆ ఏర్పాట్లలో ఉన్నామని.. త్వరలోనే ఘనంగా ఉయ్యాలవాడ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలి

కమలాపురం : హెచ్ఐవీ ఎయిడ్స్ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ వినోద్‌కుమార్ తెలిపారు. శనివారం స్థానిక ఆ కళాశాలలో విద్యార్థులకు హెచ్ఐవీ/ఎయిడ్స్ వ్యాధి పట్ల అవగాహన కల్పించారు. ఎయిడ్స్ వ్యాధి అసురక్షిత లైంగిక సంబంధాల వలన, సిరంజీలను ఎక్కువ మంది వినియోగించడం వలన వస్తుందన్నారు. ఇది అంటు వ్యాధి కాదని, అంటించుకునే వ్యాధి అన్నారు. హెచ్ఐవీ అనేది ప్రాణాంతక వ్యాధి అని, ఈ వ్యాధి చివరి స్థాయిని ఎయిడ్స్ అంటారన్నారు. ఎయిడ్స్ అనేది మానవ శరీరంలోని తెల్ల రక్త కణాలను నాశనం చేస్తుందన్నారు. ఇలా చేయడం వలన మానవులు మరణించే అవకాశం ఉందన్నారు. వివిధ శాఖల అధ్యాపకులు ఎయిడ్స్ వ్యాధి సంక్రమణ, వాటి నివారణ గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీ చీప్‌ట్రిక్స్!

- ఎస్సీ కాలనీ విద్యుత్ కట్ చేసిన అధికార పార్టీ నేతలు
- సాగునీటి సంఘాల ఎన్నికల కోసం కుయుక్తులు
- ఎంపీ చొరవతో ఎస్సీ కాలనీకి విద్యుత్ పునరుద్ధరణ


విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపడుతున్న విద్యుత్ సిబ్బంది

సాక్షి టాస్క్‌ఫోర్స్ : తెలుగుదేశం పార్టీ చీప్‌ట్రిక్స్ ప్రదర్శిస్తోంది. సాగునీటి సంఘాల ఎన్నికల కోసం ఎత్తుగడలను అవలంభిస్తోంది. నాలుగు ఓట్లు ఉంటే అనువుగా మల్చుకునేందుకు ప్రణాళిక చేస్తోంది. ఆమేరకు ప్రత్యక్షంగా, పరోక్షంగా బెదిరింపులకు దిగుతోంది. ఇలాంటి వ్యవహారమే సింహాద్రిపురం మండలం హిమకుంట్ల గ్రామంలో తెరపైకి వచ్చింది. ఆ గ్రామంలో ఎస్సీ కాలనీ విద్యుత్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని విద్యుత్ కట్ చేశారు. ఆపై రాబోవు సాగునీటి సంఘం ఎన్నికల కోసం అనువుగా మల్చుకునేందుకు సంసిద్ధులైయ్యారు. మనమొకటి తలిస్తే, దేవుడు ఇంకోకటి చేస్తాడన్నట్లుగా వ్యవహారం టీడీపీ ఎత్తుగడలను బెడిసి కొట్టింది. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి చొరవతో ఎస్సీ కాలనీకి శనివారం విద్యుత్ పునరుద్ధరించారు.

హిమకుంట్ల ఎస్సీ కాలనీలో పాత బకాయిలు ఉన్నాయని విద్యుత్ అధికారులు ఎస్సీ కాలనీకి సరఫరా చేసే విద్యుత్ వైర్లు తొలగించారు. దాంతో ఆ కాలనీ వాసులు అంధకారంలో ఉండిపోయారు. ఈ విషయాన్ని తెలుగుదేశం, బీజేపీలకు చెందిన అధికార పార్టీ నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే స్పందించి పరిష్కారం చూపాల్సిన కూటమి నేతలు నాన్చుడు దోరణి ప్రదర్శించారు. కారణం తెరవెనుక ఎత్తుగడ దాగి ఉండడమేనని తెలుస్తోంది. ఎస్సీ కాలనీ వాసులకు ఎలాంటి సహాయ సహకారాలు అందకపోవడంతో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు కిషోర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన వెంటనే ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి విషయాన్ని చేరవేశారు. ఎస్సీలు అందకారంలో మగ్గుతున్నారని తెలుసుకున్న పార్లమెంటు సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి వెనువెంటనే సొంత డబ్బులతో పాత బకాయిలను చెల్లించి మీటర్లు లేనివారికి కూడా మీటర్లు కట్టించారు. ఆపై విద్యుత్‌ను పునరుద్ధరించి శాశ్వత పరిష్కారాన్ని చూపారు. వైఎస్సార్‌సీపీ చొరవకు ఎస్సీ కాలనీ వాసులు ఎంపీ అవినాష్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పుష్పగిరిని సందర్శించిన ఆధ్యాత్మిక వక్త


పుష్పగిరి శిల్ప సంపదను పరిశీలిస్తున్న ప్రముఖ ఆధ్యాత్మిక వక్త నండూరి శ్రీనివాస్

వల్లూరు : ప్రముఖ ఆధ్యాత్మిక వక్త నండూరి శ్రీనివాస్ శనివారం పుష్పగిరి క్షేత్రాన్ని సందర్శించారు. మొదట ఆయన కొండపైన ఉన్న శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయాన్ని సందర్శించారు. అనంతరం గ్రామంలోని శ్రీ కామాక్షీ వైద్యనాథస్వామి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆలయాల శిల్ప సంపదను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయాల సందర్శన ద్వారా సనాతన ధర్మాన్ని, హిందూ తత్వాన్ని ప్రజలకు తెలియచేస్తానని తెలిపారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా పుష్పగిరిలోని దేవాలయాలపై శిల్పాలు చెక్కారని, గోపురాలపై కొద్దిపాటి స్థలాన్ని కూడా విడువకుండా శిల్పాలు చెక్కడం అద్భుతమన్నారు. రామాయణ, మహా భారత ఇతివృత్తాలను తెలిపే శిల్పాలను చరిత్రను తెలియజేసే విధంగా మహాద్భుతంగా చెక్కిన శిల్పులు అభినందనీయులని అన్నారు. పుష్పగిరి ఔన్నత్యాన్ని తన సామాజిక మాధ్యమాల ద్వారా తెలియచేస్తానన్నారు. కార్యక్రమంలో ఇంటాక్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ ట్రూ అప్ చార్జీలు రద్దుచేయాలి

జమ్మలమడుగు : తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని, భవిష్యత్తులో విద్యుత్ చార్జీలను పెంచమంటూ ఎన్‌డీఏ నాయకులు ప్రకటించారు. అధికారంలోకి రాగానే విద్యుత్‌చార్జీల మోత మోగించడంతోపాటు ట్రూ అప్ చార్జీలను పెంచడం సరైంది కాదని ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శివనారాయణ తెలిపారు. శనివారం ఆయన ఎన్జీఓ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరునెలలకే సర్దుబాటు చార్జీల పేరిట ఏకంగా రూ. 6,072 కోట్ల భారాన్ని ప్రజలపై మోపుతున్నారన్నారు. చేనేత కార్మికులకు నెలకు 200 యూనిట్లు, మరమగ్గం కలిగిన వారికి 500 యూనిట్‌లు ఉచితంగా ఇస్తామని ప్రకటించారు. అధికారంలోకి వచ్చి ఆరునెలలు దాటినా ఇంత వరకు దీనిని అమలు చేయలేదన్నారు. ఇప్పటికే చేనేత కార్మికులు సరైన పనులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాట తప్పిందన్నారు. ప్రతి యూనిట్‌కు 83 పైసలు చార్జీ వినియోగదారులు కట్టవలసి వస్తుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చేనేత కార్మికులకు వెంటనే ఉచిత విద్యుత్‌ను ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

పీడీఎస్‌యూ అర్థ శతాబ్ద సభను జయప్రదం చేయాలి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

వేంపల్లె : ఈనెల 1వ తేదీన కందుకూరులోని విక్కిర్యాలపేట రోడ్డులో ఉన్న బాలాజి ఫంక్షన్ హాలులో జరిగే పీడీఎస్‌యూ అర్థ శతాబ్ద సభ, పూర్వపు విద్యార్థుల సమ్మేళన కార్యక్రమాలను జయప్రదం చేయాలని అక్షర బాలికల జూనియర్ కళాశాల కరెస్పాండెంట్, ప్రైవేట్ బాలికల జూనియర్ కళాశాలల యాజమాన్యాల ఉపాధ్యక్షురాలు విజయభారతి కోరారు. శనివారం వేంపల్లె పట్టణంలోని అక్షర జూనియర్ కళాశాలలో సభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా నాయకుడు మహేష్ మాట్లాడుతూ అర్థ శతాద్ద సభకు అభిమానులు, విద్యార్థులు తరలివస్తున్నారన్నారు.

నకిలీ ఆర్ఎంపీ వైద్యుడిపై చర్యలకు డిమాండ్

చక్రాయపేట : మండలంలోని కుమార్లకాల్వలో ఆర్ఎంపీ వైద్యుడుగా పనిచేస్తున్న శ్రీనివాసులు నకిలీ వైద్యుడని అతనిపై చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు బహుజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాల ఓబయ్య తెలిపారు. శ్రీనివాసులు ఎలాంటి సర్టిఫికేట్లు లేకుండానే వైద్యుడిగా చలామని అవుతూ ప్రజల ప్రాణాలతో చలగాటం ఆడుతున్నారని తెలిపారు. ఇటీవలే కుమార్లకాల్వలో ఒయువతికి ఇంజక్షన్ వికటించి ప్రాణాపాయ స్థితికి చేరుకుందన్నారు. తాను కదిరిలోని కేకే ఆస్పత్రిలో వైద్యం నేర్చుకున్నట్లు చెపుతున్నాడని ఈవిషయంపై ఆరా తీస్తే శ్రీనివాసులు పేరున్న వ్యక్తి మావద్ద ఎవరూ పనిచేయలేదని వారు తెలిపారన్నారు. సదరు ఆర్ఎంపీపై చక్రాయపేట వైద్యాధికారితో పాటు డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.